
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 27-03-2026
Medchal - Malkajgiri । Friday 27-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 299
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 299 । Pages : 8 । ₹: 5



# 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా

- తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు
- అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స అందడం లేదన్న వాదన వాస్తవం కాదు
- 2,408 కోట్లు చెల్లించామని వెల్లడి.. ఆరోగ్యశ్రీ బకాయిలపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**జయభేరి, హైదరాబాద్ :**

శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని అనేక అంశాలను తెలిపారు. "రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నాం. పేదలకు జీవిత బీమాను అందించి వారిలో ధీమా కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు మొత్తంగా రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద ప్రతి నెలా సగటున రూ. 52 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత 7 డిసెంబర్ 2023 నుంచి 25 మార్చి 2026 కాలంలో ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెట్టింది. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మాపై పెట్టింది.

...మిగతాది 2 లో

ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం గడిచిన 27 నెలల కాలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను శాసనసభ ముందు వివరించారు.

# మార్కాపురం బాధిత కుటుంబాలకు భరోసా

## మార్కాపురం బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి



> కాసేపట్లో గమ్యానికి చేరుకుంటామనేలోపే, అగ్నికీలల రూపంలో కబళించిన మృత్యువుకు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మార్కాపురం జిల్లా రాయవరం దగ్గర ఈ ఘోర దుర్ఘటన ఎన్నో కుటుంబాలను విషాదంలో నింపింది. ప్రైవేట్ ట్రావెల్స్ నిర్లక్ష్యానికి 13మంది ప్రాణాలు కోల్పోయారు. నిద్రలో ఉన్నవాళ్లు నిద్రలో ఉన్నట్టే సజీవ దహనమైపోయారు. ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నంలో మరికొందరు బస్సు అద్దాల మధ్య ఇరుక్కుని తగలబడిపోయారు.

**జయభేరి, న్యూఢిల్లీ:**

మార్కాపురం బస్సు ప్రమాదంలో 13 మంది సజీవ దహనమయ్యారని పోలీసులు తెలిపారు. మరో 28 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో 13 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చాలామందికి 40 శాతం వరకు కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నారు. కొందరికి విరిగిపోయిన కాళ్లూ చేతులు.. మరికొందరికి తలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ 13 మందిని ఒంగోలు రిమ్స్‌కి తరలించినట్లు అధికారులు తెలిపారు. మార్కాపురం బస్సు ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన ప్రధాని మోదీ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. చనిపోయినవారి కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50వేల పరిహారం ప్రకటించారు ప్రధాని మోదీ. ఇదిలావుంటే, మార్కాపురం

...మిగతాది 2 లో

# ఎలాంటి పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలి



- ముఖ్యంగా గ్యాస్, చమురు సరఫరా తగ్గడంతో పలు దేశాల్లో తీవ్ర ప్రభావం
- అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం.. ప్రధాని మోదీ

**జయభేరి, న్యూఢిల్లీ:**

ఇరాన్, ఇజ్రాయెల్ అమెరికా మధ్య యుద్ధం కొనసాగుతోంది.. గల్ఫ్ లో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి.. దీంతో యుద్ధం ప్రభావం ప్రపంచమంతా కనిపిస్తోంది.. ముఖ్యంగా గ్యాస్, చమురు సరఫరా తగ్గడంతో పలు దేశాల్లో తీవ్ర ప్రభావం కనిపిస్తోంది.. ముఖ్యంగా భారత్ లో సైతం గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత కనిపిస్తోంది.. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. శుక్రవారం అన్ని రాష్ట్రాల

...మిగతాది 2 లో

# మధ్యాహ్నభోజనంలో చేపల కూర



**జయభేరి, హైదరాబాద్, మార్చి 26 :**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక తీపి కబురు అందించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్నబియ్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తుండగా, ఇకపై ఆ మెనూలో చేపల కూరను కూడా చేర్చనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అసెంబ్లీలో వెల్లడించారు.సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ ఈ ప్రకటన చేశారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "మధ్యాహ్న భోజన పథకంలో చేపల కూరను అందిస్తాం. ఈ అంశంపై ఇప్పటికే కేబినెట్లో చర్చించాం" అని ఆయన వివరించారు.పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని, వారి కోసం ప్రత్యేకంగా 'తిలాపియా' అనే జాతి చేపలను పెంచనున్నట్లు మంత్రి తెలిపారు. "ఈ చేపకు మధ్యలో ఒక్కటే వెన్నుముల్లు ఉంటుంది. కాబట్టి పిల్లలు ఎలాంటి ఇబ్బంది లేకుండా తినవచ్చు. వీటిని ప్రత్యేకంగా పెంచి విద్యార్థులకు అందిస్తాం" అని శ్రీహరి పేర్కొన్నారు. గుడ్ల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఆయన గుర్తుచేశారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడంతో పాటు, గ్రామస్థాయిలో క్రీడలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించామని మంత్రి తెలిపారు.



# 28న ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

**జయభేరి, విజయవాడ, మార్చి 26 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేస్తోంది. ఈ నెల 28వ తేదీన ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపరిచి, రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ ఒక చారిత్రక తీర్మానాన్ని ప్రవేశపెట్టనుంది. గత కొన్నేళ్లుగా రాజధాని విషయంలో కొనసాగుతున్న సందిగ్ధతకు, న్యాయపరమైన చిక్కులకు ఈ తీర్మానంతో శాశ్వత పరిష్కారం లభించనుంది. రాష్ట్ర భవిష్యత్తును, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఈ సమావేశాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానాన్ని వెనువెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదన్నది పార్లమెంట్ రికార్డుల్లో స్పష్టంగా ఉండేలా కేంద్రం ద్వారా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ తీర్మానం ఆధారంగా పార్లమెంట్లో ఒక చట్టబద్ధమైన సవరణను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీనివల్ల అమరావతికి కేవలం రాష్ట్ర స్థాయిలో మాత్రమే కాకుండా, దేశ అత్యున్నత చట్టసభ ద్వారా కూడా రాజ్యాంగబద్ధమైన గుర్తింపు లభిస్తుంది.అమరావతికి చట్టబద్ధత లభించడంతో ఇకపై అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ. 15,000 కోట్ల భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించగా, దానికి తోడుగా వివిధ అంతర్జాతీయ సంస్థల నుంచి నిధుల సమీకరణకు ఈ తీర్మానం దోహదపడనుంది.

...మిగతాది 2 లో



# మార్కాపురం ప్రమాదం

- పడుకున్న చోటే మాంసం ముద్దలు

**జయభేరి, ఒంగోలు, మార్చి 26 :**

ఆంధ్రప్రదేశ్లోని మార్కాపురం జిల్లాలో ఈ ఉదయం అత్యంత దారుణమైన రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో కంకర లోడుతో

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా

ఆ భారాన్ని మోస్తూనే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాం. 7 డిసెంబర్, 2023 నాటికి గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ. 600.27 కోట్లు. అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 240.11 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 360.16 కోట్ల బకాయి ఉంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈరోజు వరకు రూ. 2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించాం. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927.99 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ. 1,480.52 కోట్లు చెల్లించాం. నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 34 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 54 కోట్లు అందించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్లు బకాయి ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టిన మొత్తం రూ. 600 కోట్లు. గత ప్రభుత్వ బకాయి పోగా గడిచిన 28 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయి కేవలం రూ. 100 కోట్లు మాత్రమే. ఇందులోనూ ప్రభుత్వ ఆసుపత్రులకే ఎక్కువగా రూ. 496.31 కోట్లు బకాయి ఉంటే, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 231.44 కోట్లు ఉంది. రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం పేదల్లో ధీమా కల్పించాలన్న సంకల్పంతోనే 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా తెస్తున్నాం.

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స అందడం లేదన్న వాదన వాస్తవం కాదు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగమైందో అందరికీ తెలిసిందే. అందుకని మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించాం. నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అలాగే వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుంది.

చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నాం. పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నాం. వైద్యులకే హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడం వల్ల వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయి. అందుకని నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నాం. విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు తల్లిదండ్రుల కోసమో, ఇతర పనుల కోసం రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను క్రియేట్ చేస్తున్నాం.

సమాజంలో వైద్య రంగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రజలకు ఉపయోగపడే సూచనలను స్వీకరిస్తాం. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం. విద్య పరంగా నర్సరీ నుంచి 10 వరకు, వైద్యం పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. మంచి రోల్ మాడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నాం..." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్రంగా వివరించారు.

## బాధిత కుటుంబాలకు భరోసా

జిల్లా రాయవరం దగ్గర టిప్పర్‌ను ఢీకొట్టింది సీటర్ కమ్ స్లీపర్ నాన్ AC బస్సు హరికృష్ణ ట్రావెల్స్ బస్సుగా పోలీసులు గుర్తించారు. జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరి వెళ్లుండగా ఈ ప్రమాదం జరిగింది. పలకల క్వారీ దగ్గర ఎదురుగా వస్తోన్న టిప్పర్‌ను ట్రావెల్స్ బస్సు వేగంగా, బలంగా ఢీకొట్టింది. బస్సు ఢీకొట్టడంతో టిప్పర్ డీజిల్ ట్యాంక్ నుంచి మంటలు చెలరేగి కొన్ని క్షణాల్లోనే తగలబడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా దగ్ధం కావడంతో 13 మంది సజీవదహనమయ్యారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు.

కొందరు బస్సులోనే సజీవదహనమైపోగా.. మరికొందరు ప్రాణాలు కాపాడుకునే క్రమంలో బస్సు అద్దాల మధ్య ఇరుక్కుని మంటల్లో కాలిపోయారు. ప్రయాణికులంతా నెల్లూరు, మార్కాపురం జిల్లా వాసులుగా పోలీసులు గుర్తించారు. ఇదిలావుంటే, ప్రమాదస్థలి భయానకంగా మారింది. దీంతో బస్సు ప్రమాద బాధిత కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది. గుర్తించలేని స్థితిలో బస్సు ప్రమాద మృతులు ఉన్నారు.

పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దలుగా మారిన డెడ్‌బాడీస్‌ను సేకరించి తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి మృతదేహాలను తరలించారు. DNA ఆధారంగా మృతులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే మృతులు, క్షతగాత్రులందరూ 30 ఏళ్ల లోపు వాళ్లే కావడం విశేషం. మరోవైపు, తమ వాళ్ల పరిస్థితి ఎలా ఉందో తెలియక మార్కాపురం ప్రభుత్వాస్పత్రిలో పడిగాపులు పడుతున్నారు కుటుంబసభ్యులు. బస్సులో కనిగిరి నియోజకవర్గానికి చెందినవాళ్లు 25మంది వరకు ఉన్నట్టు తెలిసిందని MLA ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. 20మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని.. మిగతావాళ్లు చనిపోయినట్టు తెలుస్తోందన్నారు. బస్సు ప్రమాదంలో ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన వాళ్లు 10మంది వరకు ఉన్నారన్నారు MLA కాకర్ల సురేష్. ప్రస్తుతం వాళ్ల కండీషన్ ఎలా ఉందో ఆరా తీస్తున్నట్టు చెప్పుకొచ్చారు.

## ఎలాంటి పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలి

సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీ కానున్నారు. పశ్చిమాసియా పరిస్థితులపై చర్చించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్న ప్రధాని మోదీ.. పశ్చిమాసియా పరిస్థితులతోపాటు.. దేశంలో నెలకొన్న పరిస్థితులపై కూడా సీఎంలతో నేరుగా మాట్లాడనున్నారు. అయితే.. ఈ సమావేశంలో ప్రధాని మోదీ ఏం మాట్లాడనున్నారనేది ఉత్కంఠగా మారింది. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధం భారతదేశంపై, ముఖ్యంగా ద్రవీకృత పెట్రోలియం గ్యాస్, చమురు సరఫరాలకు సంబంధించి కలిగించే ప్రభావాలను సమీక్షించడానికి సాయంత్రం 6.30 గంటలకు వర్చువల్ సమావేశం జరగనుందని వార్తా సంస్థ ఏఎన్ఐ తెలిపింది. ఈ సమావేశం సరఫరా గొలుసులు, ఇంధన భద్రత, విదేశాల్లో ఉన్న భారత పౌరుల భద్రతతో సహా సన్నద్ధతా చర్యలపై దృష్టి సారిస్తుంది. బుధవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అంశంపై జరిగే అఖిలపక్ష సమావేశం అనంతరం ఇది జరగనుంది. అయితే, ఎన్నికలు జరగనున్న కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా ఈ సమావేశంలో పాల్గొనరు. ప్రణాళిక, ప్రతిస్పందన యంత్రాంగాలలో కొనసాగింపును నిర్ధారించడానికి వారి ముఖ్య కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ ద్వారా ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు నివేదికలు తెలిపాయి. కాగా.. పార్లమెంట్ సమావేశాల్లో ఇటీవల ప్రధాని మోదీ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులతో దేశంలో ఇంధన కొరత నెలకొందని.. అయితే.. ఎలాంటి పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని.. దేశ ప్రజలు ఏ సవాలునైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగిస్తూ.. దేశప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఇంధన భద్రత, భారతీయుల రక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్ అతలాకుతలమవుతోందని.. దేశంలో కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాము గల్ఫ్ దేశాలు, అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని.. చర్చలు, దౌత్యం ద్వారానే శాంతిని పునరుద్ధరించాలని భారత్ బలంగా నమ్ముతోందని.. అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# నేడే నవమి శోభ.. చైత్ర శుద్ధ నవమి..

# శ్రీ సీతారాముల కళ్యాణం

"జయభేరి" పాఠకులందరికీ "శ్రీరామనవమి" శుభాకాంక్షలు..

"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే | సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే ||"

**జయభేరి, హైదరాబాద్ :**


శ్రీరాముని శ్లోకాలలో అత్యంత శక్తివంతమైనది, పవిత్రమైనది "రామ తారక మంత్రం". పరమశివుడు పార్వతీ దేవికి ఉపదేశించిన ఈ శ్లోకం విశిష్టత.. గణిత శాస్త్రం ప్రకారం, 'ర' అక్షరం రెండో హల్లు, 'మ' అక్షరం ఐదో హల్లు. వీటిని గుణిస్తే (2x5) 10 వస్తుంది. అలా మూడు సార్లు 'రామ' అంటే (10x10x10) 1000 అవుతుంది. అందుకే ఇది సహస్రనామ తుల్యం.

రామకథను,వివరిస్తూ, దేశం శ్రీ రాముని పరిపాలనలో ఎలా ప్రజలు సంతోషంగా ఉన్నారో, అలానే నేడు ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఈ రోజున పూజలు చేస్తుంటారు. హిందూ మత విశ్వాసాల ప్రకారం దశరథుడు, కౌసల్య దంపతులకు శ్రీరాముడు జన్మించాడు. త్రేతాయుగంలో చైత్ర శుద్ధ నవమి రోజున, వసంత ఋతువు కాలంలో, పునర్వసు నక్షత్రం కర్కాటక లగ్నంలో మధ్యాహ్నం 12 గంటలకు పుట్టాడు హిందువుల నమ్మకం.

రామాయణంలో శ్రీరాముడికి వశిష్ఠ మహర్షి నామకరణం చేశారు. ఇందులో "రమంతే యోగినో యత్ర రామ" అని ఒక అర్థం అంటే.. యోగీశ్వరులు ఏ దేవుడి నుంచి ఆస్వాదన చెందుతారో వారే రాముడు అని అర్థం... నిజానికి శ్రీరాముడికి ఎందుకంత ప్రాచుర్యం పొందింది...

ఒక అమ్మాయికి శ్రీరాముడు లాంటి మంచి భర్త దొరకాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంది. భారతీయ స్త్రీ యొక్క లక్షణం. అంటే ఎలాంటి చెడు అలవాట్లు లేకుండా భార్యను ప్రేమించే ఏకపత్ని వ్రతుడుగా పరిపాలన సౌభాగ్యం కోసం తాను కష్టాలు పడిన ప్రజలకు ఏనాడు కష్టాన్ని రాకుండా చూసుకొని పరిపాలన చేసిన మహారాజు శ్రీరాముడు. హిందూ పురాతన సనాతన ఆచార వ్యవహారాల ప్రకారంగా... నవమి నాడు శ్రీరామానికి సీతమ్మవారికి వివాహ మహోత్సవ కార్యాన్ని కూడా జరుగుతుంటారు. ఇక ఈ వేడుకలో సహజంగా మనం వివాహ శుభకార్యాలు ఎలా జరుపుకుంటామో దేవి దేవతలకు కూడా అలాగే వివాహాధి కార్యక్రమాలు ఈరోజున పూర్తి చేస్తారు. శ్రీ మహా విష్ణువు యొక్క అవతార రూపమే శ్రీరాముడు... శ్రీరాముడు అని ఒకే మాటలో తన వ్యక్తిత్వం గురించి చెప్పాలంటే.. మాటలు సరిపోవు... మానవజారిగా సాక్షాత్తు శ్రీ మహా విష్ణువే రాజుగా, శ్రీరాముడిగా త్రేతా యుగంలో అవతారం పొంది ఒక మహత్కార్యాన్ని పూర్తి చేశారు. మహాతల్లి సీతమ్మవారు శ్రీరాముడి కోసమే పుట్టినట్టుగా రామాయణ కావ్యం లో మనం శ్రీ రామ కథనువిన్న పఠించిన పుణ్యంతో పాటు జన్మ సాఫల్యం కూడా దక్కుతుంది.

**రామ.. రామ.. రామ రామ..** అని పలుమార్లు పటిస్తే రాయి లాంటి మనసు కూడా కరిగిపోయి మనిషిగా మహర్షిగా ఎదుగుతారు. దాంపత్య జీవితానికి శ్రీ సీతారాముల ఆశీర్వాదం కావాలని భక్తులు ఎన్నో పూజలు మొక్కులు మొక్కుతారు. మహిళలు తమ పసుపు కుంకుమలు క్షేమంగా ఉండడం కోసం పొద్దున్నే లేచి స్నానం చేసి ఈ రోజున కొత్త బట్టలు ధరించి శ్రీ సీతారామ విగ్రహాలకు పట్టు వస్త్రాలు ధరించి పూలతో అలంకరించి వివాహ వేడుకలు పూజలు ఘనంగా ఈ రోజున జరిపిస్తారు.





**మోతె రఘు తిరుపతి రెడ్డి**
**'జయభేరి' దినపత్రిక చీఫ్ ఎడిటర్**

శ్రీరామనవమి అంటేనే ముఖ్యంగా పానకం, వడపప్పు గుర్తుకువస్తాయి. మండు వేసవిలో శరీరానికి చలువ చేయడానికి పానకం, మజ్జిగను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంచుతారు. ఈ రోజున 'రామకోటి' రాయడం ప్రారంభించడం చాలా పుణ్యఫలమని భావిస్తారు. అలాగే రామరక్షా స్తోత్రం, హనుమాన్ చాలీసా వంటి భక్తి గీతాల శ్రవణం ప్రశాంతతను ఇస్తుంది.

**ఉపవాసం:** చాలామంది ఈ రోజు సాయంత్రం వరకు లేదా కళ్యాణం పూర్తయ్యే వరకు ఉపవాసం ఉంటారు. శక్తి లేని వారు పండ్లు, పాలు తీసుకుంటారు.

**కళ్యాణోత్సవం వీక్షించడం:**
వీలైతే సమీపంలోని రామాలయానికి వెళ్లి సీతారాముల కళ్యాణాన్ని కళ్లారా చూడటం చాలా పుణ్యప్రదం. దూరంగా ఉన్నవారు టీవీల్లో లేదా ఆన్‌లైన్‌లో భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాల్లో జరిగే కళ్యాణాన్ని వీక్షిస్తారు.

**ముత్యాల తలంబ్రాలు:**
కళ్యాణం జరిగిన తర్వాత ఇచ్చే తలంబ్రాలను (బియ్యం, ముత్యాలు) ఇంటికి తెచ్చుకుని, తలపై చల్లుకోవడం లేదా దాచుకోవడం శుభప్రదంగా భావిస్తారు.

**ప్రసాద వితరణ:**
శ్రీరామనవమి అంటేనే ముఖ్యంగా పానకం, వడపప్పు.

**పానకం:** మిరియాలు, బెల్లం కలిపిన ఈ పానీయం వేసవి తాపాన్ని తగ్గిస్తుంది.

**వడపప్పు:** నానబెట్టిన పెసరపప్పు శరీరానికి చలువ చేస్తుంది.

వీటిని నైవేద్యంగా పెట్టి, పదిమందికి పంచడం ఈ పండుగ ప్రత్యేకత.

**ఇంట్లోనే చిన్నపాటి పూజ:**
గుడికి వెళ్లలేని వారు ఇంట్లోనే సీతారాముల పటాన్ని అలంకరించి, వీలైతే ఒక కొబ్బరికాయ కొట్టి, పైన చెప్పిన ప్రసాదాలు నివేదించాలి.

**రామకోటి లేదా శ్లోకాల పఠనం:**
ఈ పవిత్రమైన రోజున "శ్రీరామ రామ రామ" అని రామకోటి రాయడం లేదా శ్రీరామ రక్షా స్తోత్రం పఠించడం వల్ల ఇంట్లో ప్రశాంతత నెలకొంటుంది. నవమి రోజున పూజ చేసే విధానాన్ని ఒకసారి చూద్దాం... ఉదయాన్నే తలస్నానం చేసి, ఇంటిని, పూజా గదిని శుభ్రం చేసుకోవాలి. గుమ్మానికి మామిడి ఆకుల తోరణాలు కట్టుకోవడం శుభప్రదం. ఒక పీటపై ఎర్రటి లేదా తెల్లటి వస్త్రాన్ని పరిచి, సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమంత సమేత శ్రీరామ పట్టాభిషేకం పటాన్ని ఉంచాలి.

దీపారాధన: పటము ముందు దీపాలను వెలిగించి, గణపతిని స్మరిస్తూ పూజను ప్రారంభించాలి. (ఏ పూజ అయినా విఘ్నేశ్వరుడితోనే మొదలవ్వాలి).



**కడారి శ్రీనివాస్**
**జయభేరి సీనియర్ జర్నలిస్ట్,**
**98489 62799**
**కవి రచయిత, గాయకుడు,**
**తెలంగాణ ఉద్యమకారుడు,**
**గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత**

**షోడశోపచార పూజ:** రాముడికి అర్ఘ్యం, పాద్యం సమర్పించి, గంధం, కుంకుమతో అలంకరించాలి. "శ్రీ రామచంద్రాయ నమః" లేదా "శ్రీ రామ రామ రామేతి.." శ్లోకాన్ని పఠిస్తూ పూలతో అర్చన చేయాలి. సాధ్యమైతే విష్ణు సహస్రనామం లేదా రామ అష్టోత్తర శతనామావళి చదువుకోవాలి.

**నైవేద్యం:** ముఖ్యంగా పానకం (బెల్లం, మిరియాల పొడి, యాలకులతో చేసింది), నానబెట్టిన వడపప్పు (పెసరపప్పు), మరియు చలివిడిని నైవేద్యంగా సమర్పించాలి.

**హారతి:** చివరగా కర్పూర నీరాజనం ఇచ్చి, రాముడికి మనసులో మొక్కుకుని ప్రసాదాన్ని స్వీకరించాలి.

**గమనిక:** మీ దగ్గర సీతారాముల విగ్రహాలు ఉంటే, వీలైతే ఇంట్లోనే చిన్నపాటి సీతారామ కళ్యాణం జరిపించడం చాలా విశేషం.

## 28న ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

రాజధాని నిర్మాణానికి సంబంధించి ఎదురయ్యే సాంకేతిక, న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో, ఐకానిక్ భవనాలు, రోడ్ల నెట్వర్క్ వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన ముందుకు సాగేందుకు మార్గం సుగమమవుతుంది.ఏపీ రాజధానిపై స్పష్టత రావడంతో పారిశ్రామికవేత్తలు , ఐటీ కంపెనీల్లో నమ్మకం పెరిగింది. అమరావతిలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రభుత్వం భరోసా ఇస్తుండటంతో, భారీ ఎత్తున పెట్టుబడులు తరలివచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ తీర్మానం ద్వారా కేవలం భౌతిక నిర్మాణాలు మాత్రమే కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేలా ఒక సమగ్రమైన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.ఐదేళ్ల పాటు రాజధాని కోసం అలుపెరగని పోరాటం చేసిన అమరావతి రైతుల త్యాగాలకు ఈ తీర్మానం ఒక గౌరవంగా నిలుస్తోంది. రాజధాని ప్రాంతంలో ఇచ్చిన భూములకు భద్రత కల్పిస్తూనే, వారి జీవన ప్రమాణాలు పెంచేలా అభివృద్ధి పనులను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తానికి 28వ తేదీన జరగనున్న ఈ అసెంబ్లీ సమావేశం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.

## మార్కాపురం ప్రమాదం

వెళ్తున్న టిప్పర్, ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీ కొట్టడంతో ఘోరం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ అగ్ని ప్రమాదంలో మొత్తం 13 మంది ప్రయాణికులు బస్సులోనే చిక్కుకుపోయి సజీవ దహనమయ్యారు. ఈ ఘటన అందర్నీ దిగ్భ్రాంతికి గురి చేసింది. హరికృష్ణ ట్రావెల్స్కు చెందిన బస్ నిర్మల్ నుంచి వింజమూరుకు వెళ్తుండగా ఈ విషాదం చోటు చేసుకుంది. చీమకుర్తి నుంచి కంకర లోడుతో వస్తున్న టిప్పర్, రాయవరం వద్ద బస్సును బలంగా ఢీ కొట్టింది. ఈ క్రమంలోనే టిప్పర్ డీజిల్ ట్యాంక్ పగిలిపోవడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ మంటలు తక్షణమై బస్సు అంటుకున్నాయి. క్షణాల్లోనే వాహనం పూర్తిగా దగ్ధమైందని మార్కాపురం డీఎస్పీ నాగరాజు వెల్లడించారు. ప్రమాదం వెనుక సాంకేతిక లోపాలు కూడా ఉన్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. బస్ కండిషన్ సరిగా లేదని ప్రయాణికులు మొదట్లోనే ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సిబ్బంది యర్రగొండుపాలెం వద్ద గంటసేపు ఆపేసి రిపేర్ చేశారు. అనంతరం ప్రయాణం కొనసాగించారు. ఇది జరిగిన కాసేపటికే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. బస్ సిబ్బందిని విచారించగా స్టీరింగ్ స్ట్రక్ అవ్వడం వల్లే ప్రమాదం జరిగిందని చెప్పినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో సుమారు 28 మందికిపైగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం వివిధ ఆసుపత్రులకు తరలించారు. వారిలో సుమారు ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మంటల తీవ్రత ఎక్కువగా ఉన్నందున బస్ పూర్తిగా కాలిబూడిదైంది. మృతదేహాలను వెలికితీసే క్రమంలో దృశ్యాలు అత్యంత దారుణంగా ఉన్నాయని రెస్క్యూ సిబ్బంది తెలిపారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో మృతుల కుటుంబ సభ్యుల డీఎన్ఏ ఆధారంగా వారిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతి చెందిన వారంతా కనిగిరి, పామూరు ప్రాంతాలకు చెందిన వారిగా అధికారులు గుర్తించారు.

**బాధితుల కోసం అత్యవసర సహాయం**

ప్రమాదంలో చిక్కుకున్న వారి వివరాలను తెలుసుకునేందుకు, సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు ప్రభుత్వం తక్షణమే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. 6304285613, 9985733999, 7989537285, 9703578434ఫోన్ నెంబర్ల ద్వారా సమాచారం పొందవచ్చని అధికారులు సూచించారు. ఈ ఘోర ప్రమాదంపై ప్రదానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయానిధి నుంచి రెండు లక్షల రూపాయలు చొప్పున, గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై జిల్లా యంత్రాంతో ఫోన్లో మాట్లాడి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. ప్రమద కారణాలపై తక్షణమే దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని పోలీసులను కోరారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్ వెనుక భాగంలో ఉన్న వారు మంటల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించినా డ్రైవర్ పారిపోవడంతో అది సాధ్యం కాలేదని చెబుతున్నారు. సహాయం కోసం ఎమర్జెన్సీ నెంబర్లకు ఎన్నిసార్లు కాల్ చేసినా ఎవరూ స్పందించలేదని, రెస్క్యూ టీం సకాలంలో వచ్చి ఉంటే ప్రాణ నష్టం తగ్గేదని బాధితులు చెబుతున్నారు.

**అసలేం జరిగిందంటే..**

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో పలక క్వారీల వద్ద ప్రమాదం జరిగింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్ , టిప్పర్ ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. డీజిల్ ట్యాంక్ పగిలిపోవడంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయి. బస్ పూర్తిగా కాలిపోయింది. మార్కాపురం జిల్లా మార్కాపురం గ్రామీణ మండల పరిధిలోని రాయవరం సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. గురువారం తెల్లవారుజామున ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నప్పుడు హరికృష్ణ ట్రావెల్స్కు చెందిన బస్ ఎదురుగా వస్తున్న టిప్పర్ను ఢీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్లో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లాలోని కనిగిరి వైపు వెళ్తున్న టైంలో ఈ ప్రమాదం రాయవరం వద్ద జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం బస్, టిప్పర్ అతివేగంగా ఎదురెదురుగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో టిప్పర్ డీజిల్ ట్యాంక్ పగలడంతో మంటలు చెలరేగాయి. సెకన్లలో రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. లోపల ఉన్న ప్రయాణికులు సీట్ల నుంచి లేచి బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. బస్ నిమిషాల్లోనే పూర్తిగా కాలిపోయింది. చాలా మంది ప్రయాణికులు నిద్రమత్తులో ఉండటంతో అసలు ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే మంటలు చుట్టుముట్టాయి. కొందరు సాహసించి బస్ కిటికీలు పగులుగొట్టి ప్రాణాలతో బయటపడగా, లోపల చిక్కుకున్న 16మంది సజీవదహనం అయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే బస్ పూర్తిగా అస్తిపంజరంలా మారిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరికొందరు ప్రయాణికులను పోలీసులు మార్కాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, దీని వల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయవరం సమీపంలోనీ ఈ ప్రాంతంలో క్వారీలకు ప్రసిద్ధి. ఇక్కడ భారీగా టిప్పర్ల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా తెల్లవారుజామున అతి వేగం, డ్రైవర్ల అజాగ్రత్త ప్రమాదాలకు కారణమవుతుంటాయి. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితులకు అవసరమైన వైద్య సహాం అందించడంతోపాటు మృతుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశారు. మార్కాపురం రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికుల మరణంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్తో మాట్లాడారు. క్షతగాత్రులకు అందుతున్న సాయంపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. అసలు ప్రమాదం ఎలా జరిగింది. అక్కడ ఏం జరిగిందో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని చెప్పారు. మార్కాపురం ప్రమాద ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడారు. ప్రమాద వివరాలను మంత్రి గొట్టిపాటికి అధికారులు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఏపీలో సర్పంచ్ లకు చెక్ పవర్ కట్...!

- చెల్లింపులు నిలుపుదల అత్యవసరమైతే డిడిఓ అనుమతి
- సిద్ధమవుతున్న ప్రత్యేక అధికారుల జాబితా

**జయభేరి, అనకాపల్లి:**




మరో వారం రోజుల్లో పదవి కాలం పూర్తి చేసుకుంటున్న సర్పంచులకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ఏప్రిల్ 2 తో వీరి పదవి కాలం ముగుస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ లోపుగా కొందరు సర్పంచులు నిధులు దుర్వినియోగం చేస్తారనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బుధవారం నుంచి సర్పంచులు నేరుగా చెల్లింపులు చేయడానికి అవకాశం లేదు. జీతాలు వంటి అత్యవసర చెల్లింపులు చేయాల్సి వస్తే డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్(డిడిఓ) ఆమోదించాలి.సర్పంచ్ సిఎఫ్ఎమ్ఎస్ ద్వారా బిల్లులకు థంబ్ వేస్తే మంగళవారం వరకూ నేరుగా ట్రజరికీ వెళ్లేది.కాని ఇప్పుడు డిడివో లాగిన్ కు వెళుతుంది. ఆయన ఆ ఖర్చులు పరిశీలించి థంబ్ వేస్తేనే ట్రజరీకి వెళుతుంది. అంతేగాక బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ వీడియో కాన్ఫరెన్స్ లో అందరూ జిల్లా పంచాయతీ అధికారులకు(డిపివో) చెల్లింపులపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడైనా కార్యదర్శులు సర్పంచ్ లతో కుమ్మక్కై నిధులు తీసుకునే ప్రయత్నం చేస్తే కటిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో కూడా సర్పంచ్ లకు రెండు మూడు నెలల పదవీకాలం ఉండగానే వారి చెక్ పవర్ రద్దు చేసి చెక్ బుక్ లను అధికారులు స్వాధీనం చేసుకునేవారు. ఇప్పుడు చెక్ లతో పని లేకుండా నేరుగా సిఎఫ్ఎమ్ఎస్ ద్వారా విధులు ఖర్చు చేసుకునే విధానం ఈ ఆంక్షలు విధించారు.

**సిద్ధమవుతున్న ప్రత్యేక అధికారుల జాబితా**

వచ్చే నెల మూడు నుంచి సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకునేందుకు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి మండలాల వారీగా ప్రత్యేక అధికారులను ఎవరు నియమించాలనే దానిపై జాబితాను సిద్ధం చేసి ఆయా జిల్లాల కలక్టర్లకు అందజేయాల్సి ఉంది. అందుకు ముమ్మర కసరత్తులు చేపడుతున్నారు. అసలు ఈ ప్రత్యేకత అధికారులుగా ఎవర్ని నియమిస్తారంటే ... మండల స్థాయిలో తాసిల్దార్, ఎంపీడీవో, ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు, ఇద్దరు ఎంఈఓలు, మండల వ్యవసాయ,ఉద్యానవన, వెటర్నరీ, మండల పరిషత్ పరిపాలనాధికారి వంటి వారిని నియమిస్తారు. మండల స్థాయిలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఉన్నప్పటికీ వారిని ప్రత్యేక అధికారులుగా నియమించడానికి నిబంధనలు వర్తించవు. ఎందుకంటే వారే పనులకు సంబంధించి ఎం బుక్ చెక్ మెజర్మెంట్ చేస్తారు.అందువల్ల వాళ్లకే నిధులు ఖర్చు పెట్టే అవకాశం ఉండదు. కొన్ని మండలాల్లో ఎక్కువ గ్రామపంచాయతీ ఉండటం వల్ల రెండు ,మూడు పంచాయతీలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి.అయితే తాసిల్దార్, మండల విద్యాశాఖ వంటి అధికారులు బిల్లులు చెల్లింపులో మరింత లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకోవటంతో పాటు గ్రామ పంచాయతీ వ్యవస్థపై తగినంత అవగాహన లేకపోవడం వల్ల వారిని ప్రత్యేక అధికారులుగా నియమించుకోవడానికి చాలా మంది ఉత్సహం చూపడం లేదని సమాచారం.

# స్మార్ట్ కిచెన్ నిర్ణయంతో మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఎసరు

- స్మార్ట్ కిచెన్ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి
- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గని శెట్టి డిమాండ్
- విద్యాశాఖ అధికారి డి దివాకర్ రావుకి మెమొరండం అందజేత

**జయభేరి, పరవాడ:**




గత 23 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకాన్ని ఎటువంటి లాభా పేక్ష లేకుండా పేద పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వండి పెడుతున్నారని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ అన్నారు. అటువంటి మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర బిజెపి ,రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు "స్మార్ట్ కిచెన్" పేరుతో ఒకే చోట వండి స్కూళ్లకు క్యారేజీలు పంపాలని ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. పరవాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద, విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి గురువారం పరవాడ విద్యాశాఖ అధికారి డి దివాకర్ రావుకి మెమొరండం అందజేశారు.ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ ఈ స్మార్ట్ కిచెన్ల వలన వేలాదిమంది వంట కార్మికులకు ఉపాధి పోతుందని స్మార్ట్ కిచెన్ కి వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని గని శెట్టి పిలుపునిచ్చారు. స్మార్ట్ కిచెన్లతో నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టిక ఆహారం అందుతుందని ప్రభుత్వం చెబుతోందని గత ఎన్నో ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు సమయానికి బిల్లులు రాకపోయినా అప్పులు చేసి వండి పెడుతున్నారని సంవత్సరాలు తరబడి జీతాలు పెరగలేదు, అయినా మధ్యాహ్నం భోజన పథకాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని, ప్రైవేట్ పరం చేయాలని స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేస్తున్నాయిని ఒక్కొక్క స్మార్ట్ కిచెన్కి ప్రభుత్వమే స్థలం ఇస్తుందని నిర్మాణానికి 55 లక్షలు ఖర్చు చేస్తుందని అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెబుతూనే స్మార్ట్ కిచెన్ పేరుతో వంట కార్మికుల ఉపాధి పోగొడుతున్నారని వంట కార్మికుల ఉపాధి రక్షణ కోసం స్మార్ట్ కిచెన్ కు వ్యతిరేకంగా అందరం ఐక్యంగా పోరాడాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం సిఐటియు పరవాడ మండల కార్యదర్శి కే విమల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పి మాణిక్యం, అన్నపూర్ణ, బంగారమ్మ మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల సంఘం నాయకులు దేవుడమ్మ, వరహాలమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే ప్రమాదాలు జరుగుతాయి

- యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు

**జయభేరి, యాదగిరిగుట్ట :**




రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణ రక్షణకు ట్రాఫిక్ రూల్స్ రూపొందించబడ్డాయి. తివేగం,మద్యం తాగి డ్రైవింగ్ చేయడం ,ఓవర్ టేక్ తదితర నిబంధనలు పాటించని సందర్భాలలో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్ల ఏర్పడే ప్రమాదాలు.. నిబంధనలు పాటించడం వల్ల సురక్షిత ప్రయాణ ప్రయోజనాలపై యాదగిరిగుట్ట పోలీసులు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యం తీసుకువస్తున్నారు. గురువారం అరైవ్ అండ్ అలైవ్ ప్రోగ్రాంలో భాగంగా యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్టాండ్ ఓవర్ టేకింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు,రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాల గురించి యాదగిరిగుట్ట డిఎస్పి శ్రీనివాస్ నాయుడు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎలగొండ కృష్ణ, ఎస్ఐలు దేవేందర్, సైదులు, కృష్ణస్వామి, రూప శ్రీ, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.


# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తాం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**



గోదావరి జలాలతో ప్రతి చెరువును నింపి ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తున్నామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. గురువారం యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో చెరువు నిండి అలుగుపోస్తుండడంతో బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లును సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేరుతుందని, లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. ఆలేరు నియోజకవర్గంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఎండాకాలంలో కూడా గోదావరి జలాలతో ప్రతి చెరువును నింపుతున్నామని, సాగు,తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధే ప్రజా పాలన అందిస్తున్నామని, ప్రజలకు సేవకుడిగా నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాపురం గ్రామ సర్పంచ్ కన్నాయి రోజాదర్శన్, ఉప సర్పంచ్ దుంబాల వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు నంద జీవనపాండు, బోట్టు ప్రభాకర్, రుద్రబోయిన అండాలుఅశోక్, సిద్దేశ్వర్, శ్రీధర్, మాజీ ఎంపిపి చీర శ్రీశైలం, గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# అంగన్‌వాడి సిబ్బంది వేతనం రూ.18 వేలకు పెంచాలి

- పీఎఫ్ తో పాటు అంగన్‌వాడి టీచర్ పోస్టులను భర్తీ చేసి,పెండింగ్ వేతనాల చెల్లింపు.. పెన్షన్ సౌకర్యం కల్పించాలి అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య విజ్ఞప్తి

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 26 :**

అంగన్‌వాడీలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ,కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారి సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావంతో ఉన్నారని, కాబట్టి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. గురువారం అసెంబ్లీలో అంగన్‌వాడీ సమస్యలపై ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అంగన్‌వాడీ సిబ్బందికి నెలకు రూ.18 వేల వేతనం,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని,ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులను భర్తీ చేయాలని,పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని,రిటైర్మెంట్ అనంతరం పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల భవిష్యత్‌ను నిర్మించడంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని, పోషకాహారం, గర్భిణీ స్త్రీలను సంరక్షించడం వంటి బాధ్యతలతో వారు సమాజానికి బలమైన పునాది వేస్తున్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విజ్ఞప్తి చేశారు.

# నేడు అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



**జయభేరి, పరవాడ:**

పరవాడ గ్రామంలో సంతబయలు వద్ద కొత్తగా నిర్మాణం చెయ్యబడ్డ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం ఉదయం 8:14 నిమషాలకి పురోహితులుచే నిర్వహించడానికి నిర్వహాకులు ఏర్పాట్లు పూర్తి చేసారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గత రెండు రోజుల హోమం కార్యక్రమంలో స్థానిక ప్రజానీకం ఉత్సాహంగా పాల్గొన్నారు.విగ్రహ ప్రతిష్ట,గోపురంపై పసిడికలశం ప్రతీష్ట కార్యక్రమం ముగిసిన తరువాత దాతలు సహాయంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేసారు.విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామ పురప్రజలు అందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చెయ్యాలని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేసారు.



# బొమ్మగాని ధర్మభిక్షం ఆశయాలు సాధించాలి

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 26:**

మాజీ ఎంపీ, స్వాతంత్ర్య సమరయోధుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్ అన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతిని యాదగిరిగుట్ట పట్టణంలోని గౌడ్ సొసైటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధర్మ భిక్షం తన జీవిత మంతా పేద ప్రజల హక్కుల కోసం,వారి బాగు కోసం పోరాటం చేశారన్నారు. గీత వృత్తిలో ఉన్న కష్టాలను చూసి వారి కోసం గీతా పనివారల సంఘంను ఏర్పాటు చేసి అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్యెం కృష్ణ, యువజన సమైక్య జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్,గీతా పనివారుల సంఘం నాయకులు గుండు వెంకటేష్, మాటూరు మల్లయ్య, ఎరుకల హేమేందర్,దూశెట్టి చంద్రయ్య,కీసర బాలరాజు, నేతలు పేరబోయిన బంగారి, గోపగాని రాజు, గుండ్లపల్లి లింగం, ఆరే శ్రీధర్, పచ్చిమట్ల నరేష్, ఆరె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీర్ల అయిలయ్య చిత్రపటానికి పాలాభిషేకం

- మందనపల్లి గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులుతో పాటు రైతులు



**జయభేరి, ఆలేరు,మార్చి26 :**

ఆలేరు మండలంలోని మందనపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. గంధమల్ల రిజర్వాయర్ నుండి బిక్కేరు వాగులోకి నీరు విడుదల చేసిన సందర్భంగా పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మదనపల్లి గ్రామంలోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిక్కేరు వాగు,అశ్వరావుపల్లి రిజర్వాయర్,దేవాదుల ప్రాజెక్టు కాలువల ద్వారా సాగునీరు అందిస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారు. బీర్ల అయిలయ్య సేవలను గుర్తించి భవిష్యత్‌లో మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందనపల్లి గ్రామ సర్పంచ్ సిరిమర్తి రేణుక నరసయ్య, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కడకంచి శ్రీలత, రాజు, ఊట్కూరి అంజయ్య గౌడ్, కుర్రి సాయి కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నోముల వెంకటేష్, పాల సంఘం చైర్మన్ కడకంచి స్వాములు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు ఫ్లైయాష్ లారీల కాలుష్యంతో వ్యాపారాలు బొగ్గుపాలు

- లంకెలపాలెం జంక్షన్ వర్తకుల ఆవేదన



**జయభేరి, పరవాడ :**

లంకెలపాలెం జంక్షన్ మీదగా విపరీతమైన బొగ్గు ఫ్లైయాష్ లారీల కాలుష్యం వలన తమ వ్యాపారాలు అన్ని బొగ్గుపాలు అవ్వుతున్నాయని అక్కడి వ్యాపారస్థులు ఆవేదన వ్యకత్తం చేస్తున్నారు. ఉదయం సమయంలో రోడ్డుపై ఫ్లైయాష్ కుప్పలు కుప్పలుగా పడి ఉండడంతో చుట్టుపక్కలున్న దుకాణం దారులు తీవ్ర ఇబ్బందులు గురవ్వతున్నారు. దీనిపై లంకెలపాలెం వర్తుకుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్లైయాష్ ఎత్తివేసి రోడ్డును శుభ్రం చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన మా బ్రతుకులు మాత్రం మారవంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. లంకెలపాలెం జంక్షన్లో ఫ్లైయాష్ మరియు బొగ్గు లారీల వలన దుమ్ము ధూళితో నిండిపోయిన జంక్షన్లో వ్యాపారాలు అంతంత మాత్రం గానే ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక లోడుల వలన లారీల నుండి ఫ్లైయాష్ కింద పడిపోతుందని దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రధానార్చకుడు సురేంద్రా

- చార్యులు ఉజ్వల ఉగాది స్వర్ణ నంది పురస్కారం




**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 26 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ ప్రధానార్చకుడు బట్టర్ సురేంద్రాచార్యులు ఉజ్వల ఉగాది స్వర్ణ నంది పురస్కారాన్ని అందుకున్నారు. సాంస్కృతిక,సామాజిక సేవా రంగాల్లో విశేషకృషి చేస్తున్న ఉజ్వల సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో పురస్కారాలు ప్రదానం చేశారు. ధార్మిక సేవలను గుర్తిస్తూ యాదగిరిగుట్ట ఆలయ ప్రధానార్చకుడు బట్టర్ సురేంద్రాచార్యులకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



## గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాల కార్యక్రమం

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 26 :**

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచు తునికి లక్ష్మి రామ్ రెడ్డి ప్రారంభించారు .ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గేదలు, ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు ఇప్పించాలని కోరారు. గ్రామంలో 128 పశువులకు టీకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ శేఖర్, వెటర్నరీ అసిస్టెంట్లు రాఘవేంద్ర, సంశుద్దిన్ గోపాలమిత్రలు హర్ష, మహేష్, ప్రవీణ్ రైతులు పాల్గొన్నారు

## వైభవంగా శ్రీమద్ భగవద్గీత జ్ఞాన మహా యజ్ఞం



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 26 :**

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీమద్ భగవద్గీత జ్ఞాన మహా యజ్ఞం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హరే రామ హరే కృష్ణ భక్తబృందం అధ్యక్షుడు చెడదీపు సత్యనారాయణ, నల్ల విష్ణు, ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ముగ్గురు పుణ్య దంపతులతో కలిసి నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామ ముందు రోజు ఈ యజ్ఞాన్ని నిర్వహించడం ఆలయ కమిటీకి ఆనవాయితీగా కొనసాగుతోంది తదుపరి రోజు జరుగుతున్న శ్రీ సీతారాముల కళ్యాణం నిర్విఘ్నంగా సాఫల్యవంతంగా జరగాలని గ్రామంలో సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షిస్తూ ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. యజ్ఞంలో భాగస్వాములై ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- లక్ష్మీపురం సర్పంచ్ నల్ల ఆంజనేయులు
- గ్రామంలో హెల్మెట్లు పంపిణీ



**జయభేరి, తొర్రూరు, మార్చి26 :**

దంతాలపల్లి మండలం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తలకు హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకూడదని లక్ష్మీపురం గ్రామంలో గ్రామంలో హెల్మెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ నల్ల ఆంజనేయులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకోవద్దని అన్నారు, ఒక కుటుంబంలో పెద్దగా ప్రమాదంలో చనిపోతే ఆ కుటుంబంలో ప్రతి ఒక్కరు మానసికంగా ఆర్థికంగా అన్ని రకాలుగా నష్టపోయి వారి కుటుంబంలో ఉన్న అందరి జీవితాలు ఆగమయితాయని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలి అన్నారు, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు కృషి చేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు

## సర్పంచులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- సర్పంచ్ రాం లాల్ కు కాంగ్రెస్ కండువా కప్పిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**జయభేరి, తొర్రూరు, మార్చి26 :**

సర్పంచులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అభిప్రాయపడ్డారు.మండలంలోని పెద్ద మంగ్య తండా సర్పంచ్ జాటోతు రామ్ లాల్ గురువారం పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే యశస్విరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు.సర్పంచ్ రామ్ లాల్ ను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, సర్పంచులు గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు దాతల సహకారంతో గ్రామాలు , తండాల్లో మెరుగైన సౌకర్యాలు సమకూర్చాలన్నారు.ప్రజా ప్రభుత్వం గ్రామాలకు రహదారులు, మంచినీరు, నిరంతర విద్యుత్, పెట్టుబడి సాయం, రైతు బీమా వంటి సౌకర్యాలు కల్పిస్తుందని గుర్తు చేశారు. గ్రామ ప్రథమ పౌరులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ అభివృద్ధిని చూసి ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ పాల్గొన్నారు.

# రామా.. కనవేమి రా..! ఓ రఘురామ..!

- నేడు శ్రీరామ నవమి పర్వదిన వేడుకలు
- ముస్తాబైన ఆంజనేయ స్వామి, రామాలయాలు
- భక్తుశ్రద్ధలతో కొనసాగిన ఎదుర్కొళ్ల కార్యక్రమం

**జయభేరి, దేవరకద్ర :**





మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో శుక్రవారం జరుగు శ్రీరామనవమి పర్వదిన వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది నియోజకవర్గంలోని ఆయా మండలాలలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా శ్రీరామనవమి పర్వదిన వేడుకలకు ఆంజనేయ స్వామి దేవాలయాలతో పాటు రామాలయాలను ముస్తాబు చేశారు.

ఈ సందర్భంగా దేవాలయాల ముందు గురువారం రాత్రి పచ్చని పందిరి వేసే పనిలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా పచ్చని పందిరి కింద సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

ఈ దృశ్యాన్ని చూడడానికి భక్తుల అధిక సంఖ్యలో దేవాలయాలకు తరలిరానున్నారు. విశేష దినోత్సవం సందర్భంగా దేవాలయాలను రంగురంగుల విద్యుత్ బల్బులు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. దేవరకద్ర నియోజకవర్గం లోని దేవరకద్ర, చిన్నచింతకుంట, భూత్పూర్, మూసాపేట, కొత్తకోట అడ్డాకుల, కౌకుంట్ల మండలాలలోని ఆయా గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**-నార్లోని కుంట కుంటలో ఏర్పాటులు పూర్తి..**

దేవరకద్ర మండలం నార్లోని కుంటలు శుక్రవారం శ్రీరామనవమి పర్వదిన వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు అందులో భాగంగానే ఈ ఏడాది కూడా సీతారాముల కల్యాణ మహోత్సవానికి గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు ఈ సందర్భంగా దేవాలయం ముందు పచ్చని పందిరి వేసి అన్ని ఏర్పాటు చేస్తున్నారు.



## కోర్టు బార్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గురువారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృత్తిరీత్యా హైకోర్టు న్యాయవాది కావడంతో ఆయన ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన మున్సిపాలిటీ చైర్మన్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సమస్యలను వైద్యుడ్ని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని మున్సిపాలిటీ చైర్మన్ ఆస్పత్రి సిబ్బందికి హామీ ఇచ్చారు.

## నేడు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కు శుక్రవారం సెలవు ప్రకటించారు. శ్రీరామనవమి సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించడం జరిగింది. కావున ఆరోజు మార్కెట్ యార్డ్ లో ఎలాంటి క్రయ విక్రయాలు జరపరాదని నిర్ణయించారు. ఈనెల 28న మార్కెట్ యార్డ్ లో యధావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ యార్డ్ కార్యదర్శి తెలిపారు.

## అదిలాబాద్ జిల్లాలో భారీ ఎత్తున నాకా బందీ

**జయభేరి, అదిలాబాద్ ;**

అదిలాబాద్ జిల్లా పోలీసులు బుధవారం రాత్రి భారీ ఎత్తున నాకా బందీ నిర్వహించారు. రాత్రి 9 గంటలనుంచి పన్నెండు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 28 చెక్ పాయింట్లతో నాకా బంధీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో 41 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసారు. నెంబర్ ప్లేట్లు లేని 13 వాహనాలు, సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాపై దృష్టిసారించారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు కుడా పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయ స్వామి వారికి అష్టోత్తర కలశాభిషేకం

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 26 :**



తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ ఆంజనేయస్వామి వారికి అష్టోత్తర కలశాభిషేకం, పంచామృతాభిషేకం, శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి మూలమంత్ర సహిత రుద్ర హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితుడు రమాకాంత్ శర్మ, ప్రేమ్ కిషోర్ పాండే, సర్పంచ్ సోమల వెంకటేశం, ఆలయ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం**

తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం సీతారాముల స్వామివారికి పంచామృత అభిషేకాలు, మధ్యాహ్నం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం, రాత్రికి స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్వామి వారి కళ్యాణం లో భక్తులందరూ సాంప్రదాయ దుస్తులతో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

## అనుమతి లేని ఆసుపత్రిలో ఆర్ఎంపీ వైద్యం

- పట్టించుకోని జిల్లా వైద్య అధికారులు
- అనుమతి లేని వారాహి హాస్పటల్ పై చర్య తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

**జయభేరి, తొర్రూర్, మర్చి 26 :**




డివిజన్ పరిధిలోని పెద్దవంగర మండల కేద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఒక ఆర్ఎంపి డాక్టర్ ఆధ్వర్యంలో వారాహి హాస్పిటల్ నడిపిస్తున్నారని వైద్యాధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. వారాహి హాస్పిటల్ పేరుతో భవనాన్ని ఏర్పాటు చేసి మంచాలు పరుపులు వేసి రోగులకు చికిత్సలు ప్రారంభించారని ఈ యొక్క హాస్పటల్ కు వైద్య ఆరోగ్య శాఖ నుండి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదని అయినా ఆ ఆర్.ఎం.పి డాక్టర్ పేద ప్రజలు లక్ష్యంగా చేసుకొని చికిత్స చేస్తున్నారని సమాచారం నిబంధనకు విరుద్ధంగా నడిపిస్తున్న ఆర్ఎంపి పై జిల్లా డిఎంహెచ్వో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తుందని ఇక్కడ ప్రజలు చర్చించుకుంటున్నారు. వైద్యం అనేది రోగి యొక్క స్వభావాన్ని బట్టి అన్ని పరీక్షలు చేసి సరైన పద్ధతిలో వైద్యం అందించాలి. ఇలాంటి ఆర్ఎంపీలతో నడుస్తున్న హాస్పటల్ ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంటుంది. వెంటనే జిల్లా వైద్యాశాఖ అధికారి తనిఖీ చేసి హాస్పటల్ మెడికల్ షాప్ ను సీజ్ చేసి ఆ ఆర్ఎంపి పై చట్టపర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## విద్యుత్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

- మహా ధర్నా చేస్తున్న విద్యుత్ కార్మికులు

**జయభేరి, తొర్రూరు, మార్చి26 :**



విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని టీఎస్ ఎస్పీడీసీఎల్ కంపెనీ చైర్మన్ ధరావత్ సికిందర్ డిమాండ్ చేశారు.విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆర్టిజన్, ఆన్ మ్యాన్, స్పాట్ బిల్లర్స్,పీస్ రేట్ కార్మికులు మహా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ ట్రాన్స్కో, జెన్కో, డిస్కంలలో దాదాపు 20 వేల మంది ఆర్టిజన్స్ ఏడేళ్లుగా పని చేస్తున్నారని, అంతకుముందు ఈ కార్మికులందరూ 20 ఏళ్లు కాంట్రాక్టు పద్ధతిలోనే విద్యుత్ సంస్థల్లో పని చేశారని గుర్తు చేశారు.


అన్ మ్యాన్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాబట్టి కార్మికుల విద్యార్హతల ఆధారంగా జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజినీర్, ఆఫీస్ సబార్డినేట్ గా కన్వర్షన్ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తొర్రూరు డివిజన్ చైర్మన్ పసుపులేటి మధు, కన్వీనర్ బంధారపు శ్రీనివాస్, కో చైర్మన్ పి నాగరాజు, కో కన్వీనర్ రమేష్, జి.హరిప్రసాద్,ప్రకాష్, మంద వీరన్న, శ్రీను, వెంకన్న, ఎల్ల గౌడ్, జ్యోతి, సంధ్య, రవీందర్, రవికాంత్, పుల్లయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి

- అసెంబ్లీలో దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో ఇండ్ల కు సంబంధించిన సాంకేతిక సమస్యలను వెంటనే తొలగించాలని గురువారం అసెంబ్లీలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమస్యను తలెత్తారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన L3 లిస్ట్ లో ఉన్న సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.L2 లిస్ట్ కు సంబంధించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరై, ప్లాట్స్ లేక లబ్ధిదారులు ఇల్లు కట్టుకోలేక పోతున్నారన్నారు. త్వరితగతిన అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్న గ్రామాలలో ఇల్లు లేని వారికి ప్లాట్స్ శాంక్షన్ చేస్తే, వాళ్ళు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి వీలు ఉంటుందన్నారు.అదేవిధంగా మూసాపేట్, కౌకుంట్ల మండలాలలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి, ప్రభుత్వం ఈ రెండు మండలాలలో మండల కాంప్లెక్స్ లను మంజూరు చేయాలని కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ అసెంబ్లీ లో ప్రస్తావించారు.

# పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

- బీసం ఫౌండేషన్ఆధ్వర్యంలో కార్యక్రమం

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లి ప్రభుత్వ పాఠశాలలో బీసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను బీసం ఫౌండేషన్ అధినేత బీసం రమాదేవి ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్ర శేఖర్ చేసిన అభ్యర్థన మేరకు లక్ష్మీ పల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన 500 లీటర్ల సామార్థ్యం కలిగిన మినరల్ వాటర్ ప్లాంట్ ను యం ఈ ఓ బలరామ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ యం కె.నాగేంద్రమ్మ, సర్పంచ్ లక్ష్మీ ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆత్మకూరి కవిత నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి బీసం ఫౌండేషన్ అధినేత బీసం రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన త్రాగునీరు అందించాలనే సంకల్పంతో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే వాటర్ ప్లాంట్ ను వినియోగించుకొని సురక్షితమైన నీటిని త్రాగాలని కోరారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. లక్ష్మీ పల్లి ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి మరింతగా తోడ్పాటు అందిస్తామని భరోసా ఇచ్చారు. మండల ఎంఈఓ బలరాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందు కు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషితో పాటు దాతలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ హెచ్ యం కె. నాగేంద్రమ్మ మాట్లాడుతూ బీసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఫౌండేషన్ సేవలను మరింతగా విస్తరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ పెద్దమోని లక్ష్మీ అంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి విద్యార్థుల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా చేస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. పాఠశాల విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహణకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ఉపసర్పంచ్ కవిత నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు.దాతల సేవలను విద్యార్థులు వినియోగించు కోవాలని కోరారు.

లయన్ అశ్విని చంద్ర శేఖర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బీసం ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పాఠశాల ఉపాధ్యాయులు, పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్ర శేఖర్ అన్నారు. లక్ష్మీ పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సురక్షితమైన త్రాగునీరును అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఈ మేరకు ఆయన బీసం ఫౌండేషన్ అధినేతలైన బీసం రమాదేవి, బీసం హరీష్ రెడ్డి, పూర్ణిమ, సత్యధీర్ రెడ్డి, కార్తిక్ లకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వాటర్ ప్లాంట్ దాత బీసం రమాదేవిని శాలువ , పూల మాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ యం లు కేకే శ్రీనివాస్, ఎస్. కల్పన, బీసం ఫౌండేషన్ డైరెక్టర్ నారాయణ రెడ్డి, విద్యాభిమానులు గీత,మాజీ సర్పంచ్ రాందేవ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నాగేష్, గ్రామ పెద్దలు పెద్ద మోని ఆంజనేయులు,రాం రెడ్డి,ఎ.నాగేశ్వర్ రెడ్డి,బోయ రాములు, రాజు, భాస్కర్ రెడ్డి,తపస్ మండల అధ్యక్షులు తూడి నాగేశ్వర్ రెడ్డి, పి ఆర్ టి యు టి మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్,విజయ లక్ష్మీ, సుజాత, మురళీధర్, శ్రీనివాస్, శంకర్, మదన్, నాగేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్,విద్యా వాలంటర్ కొండన్న, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

# శ్రీనివాస్ రెడ్డికి నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరుతున్న ప్రజలు

- దంతాలపల్లి మండలంలో నిస్వార్థ నాయకుడికి ఏ పదవి వారించేనో..?
- ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ అడుగుజాడల్లో నడుస్తా
- కాంగ్రెస్ దంతాలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

**జయభేరి, దంతాలపల్లి, మర్చి26 :**



మండలం లోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, దంతాలపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు ఎల్లు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ ప్రజా అభ్యున్నతి దేయంగా, ప్రజా శ్రేయస్సు కోసం మంచికి మారుపేరుగా నిలబడి అన్నా అంటే అండగా నిలబడే నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, అధికారం ఉన్నా లేకున్నా కాంగ్రెస్ జెండా ఏ ముఖ్యమని నిలబడ్డ తిరుగులేని నాయకుడు, స్వార్థపూరిత రాజకీయాలకు స్వస్తి చెబుతూ నిస్వార్ధంగా పార్టీ శ్రేయస్సు కోసం పనిచేస్తూ ఆడంబరాలకు పోకుండా నిజాయితీ తన తన సొంత భూషణముగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చే పిలుపుల్లో ముందు ఉంటూ మండలంలో అనేక అభివృద్ధి పనులు చేయుటలో ముందు ఉంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి నా అంతిమ లక్ష్యం అంటూ ముందుకు సాగుతున్న నిస్వార్థ నాయకుడికి ఓ మంచి పదవి దక్కాలని కోరుతున్న మండల,గ్రామ ప్రజలు తన శక్తిని అంతా ఉపయోగిస్తూ పార్టీ శ్రేయస్సు కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్ రెడ్డికి నామినేటెడ్ పోస్టుల్లో కానీ ఇంకేదైనా పెద్ద పదవి వరిస్తుందని ప్రజలు పార్టీ నాయకులు ఆశిస్తున్నారు, వీరికి డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రు నాయక్ ఆశీస్సులతో అండదండలతో ముందుకు సాగి ఏ పదవులు వరిస్తాయని మండల ప్రజలు గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న వైనం, సాధారణ నాయకుడిగా ఉంటూ పార్టీ గెలుపు కొరకు అనేకసార్లు కృషిచేసి, పదవుల కోసం కాదు కానీ ప్రజా సేవ కోసం ముందుకు వచ్చి అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండి,పార్టీని నిలబెట్టడం కోసం నిస్వార్థంగా నిలబడ్డ గొప్ప నాయకుడికి ప్రజలు అండగా నిలబడ్డారు.

# సీతారాముల కళ్యాణం.. చూతము రారండి..!



- దేవరకద్రలో శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తి

**జయభేరి, దేవరకద్ర :**

దేవరకద్రలో ఈనెల 27న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది స్థానిక శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా దేవస్థానం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణం మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆరోజు దేవస్థానం ఆవరణలో సీతారామ చంద్రమూర్తుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. కార్యక్రమం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

# నియోజకవర్గ నలుమూలల పోలీసుల నిఘా

- శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు
- శ్రీరామ నవమి పండుగ సందర్భంగా షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి సమావేశం ఏర్పాటు
- ఎసిపి లక్ష్మీనారాయణ

**జయభేరి, షాద్ నగర్, మార్చి 26 :**



శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని షాద్ నగర్ పోలీస్ స్టేషన్‌లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం గురువారం శాంతి సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది.ఈ సమావేశానికి షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. షాద్ నగర్ పట్టణం పరిసర ప్రాంతాలకు చెందిన వివిధ మతాల ప్రతినిధులు, మత గురువులు, సామాజిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పౌరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మత పెద్దలు, స్థానిక నాయకులు రామ నవమి పండుగను పరస్పర అవగాహనతో, ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు.సమాజంలో శాంతి, సౌహార్ద్రతలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత సమావేశంలో పాల్గొన్న నేతలు వారి అభిప్రాయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదే విధంగా శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలను ప్రశాంతంగా,క్రమశిక్షణతో నిర్వహించాలని స్పష్టంగా ఆదేశించారు. ఎవరైనా కావాలని శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేసినా లేదా మతభావాలను దెబ్బతీసే చర్యలకు పాల్పడినా, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎసిపి హెచ్చరించారు. ఈ సమావేశాన్ని షాద్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు, మత పెద్దలు స్థానిక ప్రతినిధులకు పండుగల సందర్భంగా ప్రజలందరూ పరస్పర గౌరవంతో, స్నేహభావంతో, ప్రశాంతంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు.

# నేడు బిజెపి మండల ప్రశిక్షణ తరగతులు ప్రారంభం

- 2 రోజులపాటు ప్రశిక్షణ తరగతులు
- శ్రీవిద్య మార్షల్ తపోవనం పాఠశాల వద్ద తరగతులు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ లో ఈనెల 28, 29 లలో బిజెపి మండల ప్రశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బిజెపి పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 28న మొదటి రోజు సాయంత్రం 4 గంటల నుండి 29న సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రశిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నామన్నారు. ఈ ప్రశిక్షణ తరగతులను దేవరకద్ర మండలం గోపనపల్లి గేట్ సమీపంలోని శ్రీవిద్య మార్షల్ తపోవనం ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిక్షణకు వచ్చేవారు అందరూ 2 రోజులపాటు తరగతులు నిర్వహించే ప్రాంతంలోనే ఉండాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులకు బూత్ అధ్యక్షులు (బిఎల్ఎ 2) వివిధ మోర్చాల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ మండల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,కార్యదర్శులు,మండల కమిటీ నాయకులు, మండల నాయకులు, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, హాజరుకావాలని ఆయన కోరారు. ఈ ప్రశిక్షణా తరగతులకు హాజరయ్యే వారికి భోజన వసతి తోపాటు గృహ వసతి ఏర్పాటు చేసినట్లు కొండ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

# పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం విద్యార్థులకు మార్గదర్శనం

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 26:**




మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో పఠనాభిరుచి పెంపొందించేందుకు పుస్తక సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ బెజగం ఆనంద్ రావు, డాక్టర్ సింగం రామరావు, డాక్టర్ ప్రహ్లాద్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్లు దాసరి గోపాల్ రెడ్డి, పెండం లక్ష్మీనారాయణ, మాజీ ధర్మకర్త పట్నం నర్సింహారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు నచ్చిన మహనీయుల జీవిత చరిత్రలను చదివి వాటిపై విశ్లేషణాత్మక సమీక్షలు చేశారు. ముఖ్యంగా శ్రీకృష్ణుడు, జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, మదర్ థెరిస్సా వంటి మహనీయుల గురించి వివరిస్తూ, వారి జీవితాల నుండి పొందిన ప్రేరణను పంచుకున్నారు. దీంతో విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడింది. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. మంచి పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం విస్తరిస్తుందని సూచించారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శృతి, హర్షిత, దుర్గా దేవి, శ్వేతనా దీప్తి, హర్షిణి, ఖుష్బు కుమారి, ప్రీతి కుమారి, సునీత కుమారి, హారికలను అతిథులు అభినందిస్తూ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి మరింత పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# వరంగల్ లో కల్తీ కారం తయారీ కేంద్రంపై దాడులు

**జయభేరి, వరంగల్ :**

వరంగల్ ఎనుమాముల మార్కెట్ సమీపంలోని ఓ ఇండస్ట్రీస్ పై ఆహార నియంత్రణ శాఖ అధికారులు, పోలీసులు మెరుపు దాడులు చేశారు. మిర్చి తొడిమలతో కల్తీ కారం తయారు చేస్తున్నట్లు గుర్తించి,70 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రతా అధికారులు కృష్ణమూర్తి, మౌనికతో కలిసి సీఐ సురేశ్ ఈ తనిఖీలు చేపట్టారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ ఎన్నిక

- కమిటీ అధ్యక్షునిగా ఎల్లం ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక
- మీడియా రంగం బలోపేతానికి కృషి చేస్తామని హామీ

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 26:**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ పరిధిలో ఉమ్మడి శామీర్‌పేట ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రముఖ టెలివిజన్ ఛానళ్ల ప్రతినిధులతో కలిసి ఈ కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా కమిటీ అధ్యక్షునిగా యేల్లం ప్రసాద్ (ఏబిఎన్ )ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా వైస్ ప్రెసిడెంట్‌గా గోపాల్ (రాజ్ న్యూస్), జనరల్ సెక్రటరీగా శరత్ చంద్ర (10టీవీ), జాయింట్ సెక్రటరీగా నవీన్ (99టీవీ), ట్రెజరర్‌గా సూర్య (సాక్షి టీవీ)లను నియమించారు. ఇక గౌరవ అధ్యక్షులుగా సుక్క రవి (మహా న్యూస్), సత్యపాల్ రెడ్డి (బిగ్ టీవీ)లను ఎంపిక చేశారు. అదేవిధంగా కమిటీ సభ్యులుగా కిరణ్ (వి 6), నందు ముదిరాజ్ (ఎన్ టీవీ), నాగేష్ (సీవీర్), రాజశేఖర్ (ప్రైమ్ 9 న్యూస్), కిరణ్ (టీ న్యూస్), ప్రవీణ్ (ETV), రాకేశ్ (RTV), శ్రీనివాస్ రెడ్డి (టీవీ 9), శ్రీనివాస్ (6టీవీ), పురేందర్ (హెచ్ఎంటీవీ)లను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మీడియా ప్రతినిధుల హక్కులు, సమస్యల పరిష్కారం, పరస్పర సహకారంతో పని చేస్తామని తెలిపారు. జిల్లాలో ఎలక్ట్రానిక్ మీడియా బలోపేతానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

# బాలల పరిరక్షణ మనందరి బాధ్యత

**తీదేడు గ్రామంలో "మిషన్ వాత్సల్య పథకం"బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం.. ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి**




**జయభేరి, చింతపల్లి :**

బాలల పరిరక్షణ మనందరి బాధ్యతని తీదేడు గ్రామ సర్పంచ్ గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలను అన్ని రంగాలలో ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె అన్నారు.బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి ఒక్కరు చూడాలని ఆమె అన్నారు.బాలలందరు బడికి వెళ్ళేలా,బాల కార్మికులు లేకుండా,బాలలపై ఎలాంటి వేధింపులు జరుగకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని తెలిపారు.బాలల సంక్షేమ కోసం ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి,సోనగంటి గొవర్ధనాచారి,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి,మాదగోని కృష్ణగౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్,సందె లక్ష్మయ్య,మర్ల యాదగిరి,ఐ.సి.పి.యస్ సభ్యులు రాము,అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న లక్ష్మి,అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుణకు ప్రమాద భీమా



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ వాసి షబ్బీర్ హుసేన్ కుమారుడు జుబేరా హుసేన్ 09.09.2024 రోజు అక్కంపల్లి రిజర్వాయరులో చాపల వేటకు వెళ్లి ప్రమాద వషాత్తు కాలుజారి నీళ్లలో పడి మరణించినాడు. అతనికి పై బ్యాంకు నందు ఖాతా ఉండి ప్రతి సంవత్సరం రూ. 40 న్యూ ఇండియా ఇన్సూరెన్స్ జమచేయడం వల్ల ప్రమాద భీమా క్రింద న్యూ ఇండియా ఇన్సూరెన్స్ వారు రూ. 1,00,000 మంజూరు చేసినారు అట్టి రూపాయల సర్టిఫికెట్ బ్యాంకు సీనియర్ ఖాతాదారు, బ్యాంకు శ్రేయోభిలాషి ,దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సేవ సంఘం ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి చేతుల ద్వార అందజేయడం జరిగింది అని బ్యాంకు మేనేజర్ పాత్రునాయక్ తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కుంభం శేఖర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కిరణ్ సాగర్

- 34 ఓట్ల మెజారిటితో కిరణ్ సాగర్ విజయం
- ఓటు వేసిన బార్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు



**జయభేరి, గజ్వేల్, మార్చి 26 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో కిరణ్ సాగర్ భారీ విజయం సాధించారు, సమీప ప్రత్యర్థికి 18 ఓట్లు కిరణ్ సాగర్ కు 52 ఓట్లు రావడంతో కిరణ్ సాగర్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ సాగర్ మాట్లాడుతూ నమ్మకంతో నాకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరస్తు, గజ్వేల్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.వైఎస్ ప్రెసిడెంట్ నరేష్, జనరల్ సెక్రెటరీ కరుణాకర్, జాయింట్ సెక్రెటరీ ఉమారాణి, స్పోర్ట్స్ అండ్ లైబ్రరీ ఎం డి అబ్దుల్ గఫర్, ట్రెజరర్ అశోక్, సీనియర్ లాయర్స్, నూతన కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మిలాన్ వీధుల్లో ప్రియాంక చోప్రా గ్లామర్ షో!

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనస్ ఎక్కడ అడుగుపెట్టినా అక్కడ తనదైన ముద్ర వేయడం ఖాయం. ఇటీవల మిలాన్ నగరంలో జరిగిన ప్రతిష్టాత్మక 'బల్గారీ' ఈవెంట్‌లో ప్రియాంక మరోసారి తన గ్లామర్‌తో ప్రపంచాన్ని ఫిదా చేసింది. ముందుగా బ్లాక్ అవతార్‌లో మెరిసిన ఈ 'దేశీ గర్ల్', తాజాగా ఒక దేవదూతలా 'పేల్ గ్రీన్' రంగు గౌనులో రెడ్ కార్పెట్ మీద తళుక్కుమంది. సౌత్ కొరియన్ నటుడు కిమ్ జివాన్‌తో కలిసి ఆమె చేసిన సందడి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

పేల్ గ్రీన్ గౌనులో దేవదూతలా..

ఇటీవల జరిగిన రెడ్ కార్పెట్ వేడుకలో ప్రియాంక ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ నికోలస్ జెబ్రాన్ 2026 స్ప్రింగ్ కలెక్షన్ నుండి ఒక అందమైన గౌనును ఎంచుకుంది. ఈ స్ట్రాప్‌లెస్ గౌనుకు ఉన్న థైహై స్లిట్, బ్లష్‌ఫెదర్డ్ స్లీవ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శరీరానికి హత్తుకునేలా ఉన్న ఈ డ్రెస్ ప్రియాంక అందాన్ని మరింత రెట్టింపు చేసింది. బల్గారీ బ్రాండ్‌కు చెందిన ఖరీదైన రత్నాలు పొదిగిన నెక్లెస్, డాంగ్లర్ ఇయర్ రింగ్స్ మరియు స్టేట్‌మెంట్ రింగ్స్ ధరించి విలాసవంతంగా కనిపించింది. థిబౌడ్ సల్దుచి స్టైలింగ్‌లో ప్రియాంక మినిమలిస్ట్ మేకప్‌ను ఎంచుకుంది. గ్లోసీ పింక్ లిప్ కలర్, సాఫ్ట్ కర్ల్స్ జుట్టుతో ఆమె లుక్ చాలా ఫ్రెష్‌గా ఉంది.



## 7 రోజుల్లోనే 1000 కోట్లు..

భారతీయ సినీ చరిత్రలో అరుదైన రికార్డులు నమోదు చేస్తూ ధురంధర్ 2 బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన కేవలం ఏడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి, అత్యంత వేగంగా ఈ మార్క్‌ను అందుకున్న తొలి భారతీయ చిత్రంగా సంచలన రికార్డు సృష్టించింది. రిలీజ్‌కు ముందు నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉండగా, వాటిని మించి ప్రదర్శనతో ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా వీక్ డేస్‌లో సినిమాల వసూళ్లు తగ్గడం సహజం. కానీ ఈ సినిమా మాత్రం సోమవారం నుంచి బుధవారం వరకు కూడా అదే జోరును కొనసాగిస్తూ, కలెక్షన్ల వర్షం కురిపించడం విశేషం. గతంలో పుష్ప 2 హిందీ వెర్షన్ మొదటి వారంలో రూ.425 కోట్ల నెట్ వసూళ్లతో నెలకొల్పిన రికార్డును 'ధురంధర్ 2' అధిగమించింది. ఒకే భాషలో అత్యంత వేగంగా అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది కొత్త చరిత్ర రాసింది. తాజా లెక్కల ప్రకారం, వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరిన 10వ భారతీయ చిత్రంగా ఈ సినిమా నిలిచింది. కేవలం భారతదేశంలోనే తొలి వారం రోజుల్లో రూ.745 కోట్ల గ్రాస్ వసూలు చేయడం మరింత విశేషం. బాలీవుడ్‌లో ఇంత తక్కువ కాలంలో ఈ స్థాయి కలెక్షన్లు సాధించిన చిత్రం ఇదే కావడం గమనార్హం. ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద రూ.1471 కోట్ల గ్రాస్‌తో పుష్ప 2 టాప్ స్థానంలో కొనసాగుతోంది. అయితే 'ధురంధర్ 2' దూకుడు చూస్తుంటే ఆ రికార్డును బద్దలు కొట్టడం పెద్ద కష్టమేమీ కాదని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. హిందీతో పాటు దక్షిణాది భాషల్లో కూడా ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకోవడంతో, మరో కొద్ది రోజుల్లోనే దేశంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా అవతరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తానికి, ధురంధర్ 2 బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తున్న ఈ సునామీ, భారతీయ సినిమా మార్కెట్ పరిమితులను మరింత విస్తరించడమే కాకుండా, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## చిరంజీవి పోస్ట్‌తో ఊపిరి పీల్చుకున్న అభిమానులు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ షూటింగ్‌లో గాయపడ్డాడన్న వార్త అభిమానులను ఎంతగా కలవరపరిచిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'పెద్ది' సినిమా చిత్రీకరణ సమయంలో ఆయన కంటికి గాయం కావడం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లో జరుగుతున్న షూటింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవి స్వయంగా స్పందిస్తూ సోషల్ మీడియా ద్వారా హెల్త్ అప్‌డేట్ ఇచ్చారు. "ఈ క్లిష్ట సమయంలో చరణ్ కనురెప్పకు అత్యంత నైపుణ్యంతో చికిత్స అందించిన వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు. మొదట కొంత ఆందోళన ఉన్నప్పటికీ, వైద్యుల భరోసా మాకు ధైర్యం ఇచ్చింది. ప్రస్తుతం అంతా సవ్యంగానే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి చేసిన ఈ ప్రకటనతో మెగా అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు. సోషల్ మీడియాలో చరణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ ఫ్యాన్స్ పెద్ద ఎత్తున పోస్టులు చేస్తున్నారు. ఇక 'పెద్ది' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రాన్ని దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శివరాజ్ కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గాయం కారణంగా రామ్ చరణ్ కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోనున్నప్పటికీ, షూటింగ్ షెడ్యూల్‌లో పెద్ద మార్పులు లేకుండా ముందుకు తీసుకెళ్లాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న సినిమా విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు కొనసాగిస్తున్నారు. ఇది చిన్న గాయం అయినప్పటికీ, అభిమానుల్లో ఆందోళన కలిగించిన ఈ ఘటనపై స్పష్టత రావడంతో ఇప్పుడు అందరూ చరణ్ త్వరగా కోలుకుని తిరిగి షూటింగ్‌లో పాల్గొనాలని ఆశిస్తున్నారు. ఇక రీసెంట్‌గా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా తన సోషల్ మీడియా వేదికగా చరణ్ గాయం గురించి ట్వీట్ చేయడం మనం చూశాం. మెగా అభిమానులు, శ్రేయోభిలాషులు చరణ్ త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు కూడా చేస్తున్నారు.


## 'విరోష్' వెడ్డింగ్‌కు నెల .. అన్‌సీన్ ఫొటోలతో మళ్లీ మాయ చేసిన రష్మిక మందన్న విజయ్ దేవరకొండ!



స్టార్ కపుల్ రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ పెళ్లి తర్వాత తెగ వార్తలలో నిలుస్తున్నారు. ఫిబ్రవరి 26న వారి వివాహం కాగా, మార్చి 26తో తమ పెళ్లి జరిగి ఒక నెల పూర్తి కావడంతో, ఈ జంట తమ స్పెషల్ మూమెంట్స్‌ను గుర్తు చేసుకుంటూ ఇప్పటి వరకు ఎవరూ చూడని అన్‌సీన్ వెడ్డింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫొటోలలో ఈ జంట తమ కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రులతో కలిసి ఎంతో ఆనందంగా గడిపిన క్షణాలు కనిపించాయి. కొన్ని చిత్రాల్లో ఇద్దరూ పక్కపక్కన నిలబడి చిరునవ్వులతో పోజులివ్వగా, మరికొన్ని ఫొటోలలో ఒకరినొకరు హత్తుకుని ప్రేమను పంచుకుంటూ కనిపించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఫిదా చేస్తున్నాయి.

ఈ సందర్భంగా రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగభరితమైన పోస్ట్ షేర్ చేసింది. మా పెళ్లై నెల రోజులు అయిపోయాయంటే నమ్మలేకపోతున్నాను. ఒకప్పుడు పెళ్లి అనే ఆలోచనే చాలా దూరంగా అనిపించేది. కానీ ఇప్పుడు ఇది నా జీవితంలో అత్యంత అందమైన నిజంగా మారింది, అంటూ ఆమె తన ఆనందాన్ని పంచుకుంది. తన పెళ్లిని ప్రత్యేకంగా మార్చిన స్నేహితులు ఐశ్వర్య కొల్లా, ప్రియా మాగంటి, అర్పితలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది. వాళ్లు లేకపోతే ఈ వేడుక ఇంత అద్భుతంగా ఉండేది కాదు. ఇదే నా చిన్న ప్రపంచం, అంటూ ఎమోషనల్ అయింది.

అదే విధంగా విజయ్ దేవరకొండ కూడా తన పోస్ట్‌లో హార్ట్‌టచింగ్ మెసేజ్ రాశారు. జీవితంలో కొన్ని క్షణాలు చాలా ప్రత్యేకం. అవి ఎప్పుడు వచ్చి పోతాయో తెలియదు. కానీ ఆ క్షణాలను మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తే, అవి జీవితాంతం మనతో ఉంటాయి అంటూ ఆయన పేర్కొన్నారు. తమ వెడ్డింగ్‌ను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించిన ప్లానర్స్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక వీరి వివాహం విషయానికొస్తే, ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్ సమీపంలోని ఓ లగ్జరీ హోటల్‌లో అత్యంత సన్నిహితుల మధ్య ఈ జంట పెళ్లి పీటలెక్కింది. అనంతరం హైదరాబాద్లోని తాజ్ కృష్ణలో గ్రాండ్‌గా రిసెప్షన్ నిర్వహించారు.. దాదాపు ఏడేళ్ల ప్రేమ తర్వాత పెళ్లి బంధంతో ఒక్కటైన ఈ జంట, తమ వెడ్డింగ్‌ను 'వెడ్డింగ్ ఆఫ్ విరోష్'గా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ మళ్లీ కలిసి 'రణబాలి' అనే పీరియడ్ డ్రామాలో నటిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## సిల్వర్ స్క్రీన్ మీద సారా అర్జున్ నయా సెన్సేషన్

దురంగా సిరీస్ లో హీరోయిన్ గా నటించిన సారా అర్జున్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నారు. తొలి భాగంలో అల్లరి పిల్లగా కనిపించిన సారా సీక్వెల్ లో ఓ బిడ్డకి తల్లిగా నటించి మెప్పించారు. 20 ఏళ్ల వయసులోనే తల్లి పాత్రలో నటించి ఇండస్ట్రీ జనాలకి షాక్ ఇచ్చారు. దాదాపు 15 సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించిన సారా అర్జున్ నాన్న సినిమాతో సౌత్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అదే సమయంలో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో నటించి మెప్పించారు. చైల్డ్ ఆర్టిస్ట్ రోల్స్ చేస్తూనే పొన్నియన్ సెల్వన్ సినిమాతో సడన్ గా రొమాంటిక్ టర్న్ తీసుకున్నారు. ఈ సినిమాలో ఐశ్వర్య చిన్ననాటి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు. పొన్నియన్ సెల్వన్ లో సారా నటన నచ్చి దురంగా సినిమాలో హీరోయిన్ గా సెలెక్ట్ చేశారు దర్శకుడు ఆదిత్య ధర్. రణ్వీర్ కి సారా కి మధ్య వయసు తేడా చాలా ఉన్నా, కథ పరంగా అలాంటి తేడా ఉంటేనే కరెక్ట్ అన్న ఉద్దేశంతో ఆమెని సెలెక్ట్ చేసుకున్నారు. దర్శకుడు పెట్టుకున్న నమ్మకాన్ని వందకి వంద శాతం నిలబెట్టుకున్నారు సారా అర్జున్. ఓ వైపు దురంగా లాంటి రా యాక్షన్ మూవీలో నటిస్తూనే మరో వైపు తెలుగులో యూఫోరియా అనే రియలిస్టిక్ మూవీలో నటించారు. ఈ రెండు సినిమాల్లోనూ తన పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్న సారా అర్జున్, ఫిలిం సర్కిల్స్ లో నయా సెన్సేషన్ గా మారారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**